ఆగష్టు 15, 1929లో విజయనగరంలో పుట్టిన విశాలాక్షి పలు నవలలు, కథా సంపుటాలు వెలువరించారు. 'వారధి' నవల, 'రెండు కుటుంబాల కథ' పేరుతో చలన చిత్రంగా వచ్చింది. 13 నవలలు రాసిన విశాలాక్షిది ప్రత్యేకమైన శైలి. కథాగమనంలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ప్రసిద్ధ ఆర్థికవేత్త డి.ఎస్.రావు ఈమె భర్త. ఆయన అమెరికన్ కౌన్సిలేట్‌కి అనుబంధంగా పనిచేసే సాంస్కృతిక విభాగానికి సంచాలకులుగా పనిచేశారు. శ్రీవారితో కలిసి అనేక దేశాలు దర్శించారు. వాటిని తమ రచనల్లో ప్రతిబింబింపచేశారు. గృహలక్ష్మి స్వర్ణ కంకణంతో సహా పలు అవార్డులు ఈమె అందుకున్నారు. ప్రస్తుతం విశాఖసమీపంలో భీమ్లీలో విశ్రాంతిగా తమ జీవితాన్ని గడుపుతున్నారు.ఆమె కథల్లో గొప్పవిగా చెప్పతగిన నాలుగైదులో 'మనస్వి' ఒకటి. పత్రిక పాఠకులకు నూతన సంవత్సర కానుకగా ఈ కథను అందిస్తున్నాం.

## ఆణిముత్యాలు

# మనస్వి

### ద్వివేదుల విశాలాక్షి

ఆ రోజు పాపకి తలంటి నీళ్ళుపోసి, కొత్త బట్టలు తొడిగి మొదటి పుట్టినరోజు పండుగ చేసింది కాంతమ్మ. పిండివంటలతో భార్య పెట్టిన భోజనం ఆర గించి, భుక్తాయాసంతో పడక గదిలో మంచంపై పర మేశం కునుకు తీయబోతుంటే, వీధి తలుపు ఎవరో కొడుతున్నట్లు చప్పుడు వినిపించింది. 'ఆఁ! మిట్టమధ్యాహ్నం ఎండలోపడి తమ ఇంటికి వరొస్తారు? పక్కింటి ప్లీడరు గారి కోసం ఎవరో పార్టీ అయి ఉంటుం దిలే' అనుకుని- లేవడానికి బద్ధకించి ఇటు నుంచి అటు తిరిగి మళ్ళీ పడుకున్నాడు.

వంట ఇంటి ముందు వరండాలో కూర్చుని, తనలో తనే ఏదో సన్నగా పాడుకుంటూ మధ్యాహ్నం పేరంటంలో ఇవ్వడానికి తమలపాకుల కిళ్ళీలు కడ్తోంది భార్య కాంతం. దూరంగా పెరట్లోంచి పిల్లల ఆట పాటల కేకలు కలగలుపుగా వినిపిస్తున్నాయి.అంతలోనే మళ్ళీ వీధి తలుపు టక టక కొట్టిన చప్పుడు అయింది.

''ఏమండీ! ఎవరో తలుపుకొడ్తున్నారు. ఓసారి వెళ్ళి ఎవరో ఏమిటో చూడండి. నా చెయ్యి తెరిపిగా లేదు'' అంటూ లోనుండి కాంతమ్మ కేక పెట్టింది.

ఇంక తనకి లేవక తప్పదు అనుకుని విసుక్కొంటూనే లేచి వెళ్ళి తలుపు తీశాడు పరమేశం. ఎదురుగా ఎవరో కొత్త వ్యక్తి.అంతకి పూర్వం అతన్ని ఎక్కడా చూసిన గుర్తు లేదు. బహుశా వాలకం చూస్తే, చాలా దూరం నుండి చాలా రోజులుగా ప్రయాణం చేసి ఆ మిట్టమధ్యాహ్నం ఎండలో ఆ ఊరికి చేరిన వాడిలా ఉన్నాడు.

వేళకాని వేళప్పుడు వచ్చి, బంగారం లాంటి తన నిద్ర పాడుచేసిన ఈ ఆగంతకుడు ఎవరబ్బా... అనుకొంటూ ఎదుట నిల్చిన వ్యక్తివైపు పరీక్షగా చూశాడు పరమేశం. మనిషి బాగా పొడగరి. ఆ పొడుక్కి తగ్గ లావు,భారీ అయిన పంచలోహపు విగ్రహంలా నిండుగా ఉన్నాడు. వయసు అరవైకి పైబడి ఉండొచ్చు. మాసిన గడ్డం, నెరసిన జుట్టు, ప్రయాణపు బడలికతో వడలిన ముఖం, నలిగిన బట్టలు, కాళ్ళకి మట్టి కొట్టుకున్న చెప్పులూ... పరమేశం ఎంత పరీక్షగా చూసినా ఆ అగంతకుడు ఎవరో... ఎక్కడివాడో అతనికి గుర్తు దొరకలేదు. అతడు తనకోసం కాక ఇరుగు పొరుగు ఇంకెవరికోసమో వచ్చి వుండాలి. ఇంటి వివరాలు సరిగ్గా

## నీవే

**చీ**కటి నిండిన నా హృదయంలో
దీపావళి దివ్వెవు నీవే
కష్టంలో... సుఖంలో
నాకు తోడు నీవే
నీవు లేని ఈ లోకంలో
నేను ఎలా వుండగలను...?

## మనసు

**భా**వం...
మనసును దాటితే ప్రేమగీతం
మౌనం...
మనసును అదిమిపెడితే విషాదగీతం
పరిచయం...
మనుసును స్వీకరిస్తే ప్రేమబంధం
అదే...!
తిరస్కరిస్తే ప్రేమ విఫలం.

## ఊహ!

**ఓ** ప్రేయసీ...!
నీ కన్నులకు కాటుకనై వుండాలని
నీ పెదవులపై చిరునవ్వునై మెరవాలని
నీ నీడనై, నీ తోడునై
అనుక్షణం నీచెంతనే నిలవాలని
నా చెంతలేవని తెలిసిన క్షణాన
ఆకాశంలోకి ఎగసిపోయిన
నా ఎదలోని ఊహవు నీవే

## గాయం!

**ఎ**టు చూసినా నీ రూపమే
ప్రతి అలికిడి నీ పలుకే
ప్రతినిత్యం నీకై కలవరింతలు
నీవు విసిరిన చూపుల బాణం
నాలో చేసింది మాసిపోని గాయం

**శ్రీకాళహస్తి వెంకటశేషగిరిరావు**

తెలియక వాడలో ముందుగా ఉన్న తమ ఇంటి తలుపు తట్టి ఉండాలి... అనుకున్నాడు. అతడికి కావలసిన వివరాలు ఏవో తొందరగా చెప్పి పంపేస్తే, తను మళ్ళీ తన నిద్రా కార్యక్రమం కొనసాగించవచ్చు అన్న అభిప్రాయంతో, వీధి గడపలోకి ముందుకి వస్తూ, ''ఎవరండీ! మీకు ఎవరు కావాలి?'' అన్నాడు.

''పరమేశంగారి ఇల్లు ఇదేనాండీ?'' అంటూ ఎంతో నిదానంగా, పరమేశాన్ని పట్టి చూస్తూ ప్రశ్నించాడు అతడు.

''అవును... ఇదే. నేనే పరమేశాన్ని''

''క్షమించాలి. వేళకాని వేళ వచ్చి ఇబ్బంది పెడుతున్నాను'' అన్నాడు అతను నొచ్చుకొంటున్న ధోరణిలో.

''ఫరవాలేదు చెప్పండి'' అన్నాడు పరమేశం... లోలోపల విసుక్కొంటున్నా పైకి సభ్యతకోసం మామూలుగా ముఖం పెట్టి.

''నాపేరు రంగస్వామి. మాది ఈ ప్రాంతం కాదు. ఈ పేపరులో ప్రకటన మీరే వేయించి ఉంటారనుకొని...'' అంటూ సగంలో మాట ఆపి, పాతబడిన ఒక చిన్న పేపరు కటింగ్‌ని లాల్చీ జేబులోంచి తీసి పరమేశం చేతికందిచ్చాడు అతడు.

దాన్ని చూడగానే ఒక్కసారిగా ఎలక్ట్రిక్ షాక్ తిన్న వాడిలా అదిరిపడ్డాడు పరమేశం. నలిగి మాసి నాలుగు మడతల చుట్టగా ఉన్న ఆ కాగితం ముక్క అతడెవరో, అతనికి తనతో కలిగిన పనేమిటో చెప్పకనే చెప్తోంది.

'మీ పాప తప్పిపోయిందా?' అనే ఆప్రకటన వేయించింది తనే. పాప తమ ఇంట కాలుపెట్టి వారాలకి వారాలే... నెలలకి నెలలే గడిచిపోతున్నా... 'ఈ పిల్ల మా బిడ్డ' అంటూ పాపకోసం ఎవరూ రాకపోవడంతో... ఏమి

## మత్తువదలరా

నాతోడు నీవేనంటూ మూడు ముళ్ళు వేశావు
చివరిదాకా కలసివుంటానని ఏడడుగులు
నడిపించావు
విడిపోని బంధంలా ఒక్కటవ్వాలని
కొంగులు రెండు ముడివేశావు
అగ్నిసాక్షిగా చేయిపట్టుకొని ఆలినన్నావు
పాలు నీళ్ళలా జీవితాన్ని పంచుకోవాలని
తనువు మనసు అర్పించి నీలో సగమయ్యాను
నివురుగప్పిన నిప్పులా దాగివున్న నీ నిజస్వరూపం
గోముఖ వ్యాఘ్రంలా గర్జించి
ఆకలి చూపులతో నన్నారగించి
నిత్యం పస్తులతో - చీకటి కుహరంలో బంధించావు
అలసిపోయి ఇంటికి వచ్చావని ఆలిలా లాలించాను
అమ్మలా ఆదరించాను...
కష్టసుఖాల్లో భాగమై - కంటికి రెప్పలా చూశాను
ఉదయం నిద్రలేస్తూనే పాదాలు కళ్ళకద్దుకొంటే
ఛీత్కరించి కాళ్ళతో తన్నావు
నీతోడు కోసం-నీ నీడల్లే వుంటే
బ్రతుకంతా ఊడిగం చేసే బానిసనన్నావు
నీ అవసరాలను తీరే పనిమనిషిలా చేశావు
నీకోసం ఎదురుచూపులతో నిరీక్షించే ప్రతిరాత్రి
చెంపదెబ్బలతో కాళరాత్రిని మిగిల్చావు
ఆకలి దప్పులన్నీ మరచిపోయి అన్నీ నీవేనన్నాను!
ద్వేషించినా ప్రేమించాను!
ఎప్పటికైనా మనసుకు కమ్మిన పొరలు తొలిగి
మళ్ళీ మనిషివవ్వాలని ఆశగా ఎదురుచూస్తాను.
మత్తుమందుకు బానిసవై
నువ్వు మనిషివనే సంగతి మరచిపోతున్నావు
ఆస్తంతా కర్పూరంలా కరిగించి
ఒళ్ళు గుల్లయ్యేలా-గుండె చిల్లుపడేటట్లు
తాగి తాగి వాగుతూ, తూలుతూ
పరువు ప్రతిష్టల్ని మంటగలిపి-మద్యం మత్తులో
కాపురాన్ని కూల్చుకొని-జీవితాన్ని నరకం
చేసుకొంటూ
నిన్ను నీవే దహించుకుపోతున్నావు
నీ రక్తాన్ని నీవే తాగుతున్నావు
అది విషమని తెలిసి-ప్రమాదాల అంచున పడిలేస్తూ
మరణానికి ముహూర్తం వ్రాసుకొంటూ
భవిష్యత్తుని చేచేతులా నాశనం చేస్తూ
మొదటిసారి సరదాగా సాలెగూటిలో చిక్కావు!
అది నీకు మృత్యుకుహరమని తెలుసుకో
నువ్వు నిజాన్ని తెలుసుకొనే లోగా
నిన్ను మృత్యువు కబళించకమానదు
తాగితే తప్పేనని తెలుసుకో

**తాటికోల పద్మావతి**

చెయ్యాలో పాలుపోక మిత్రుల సలహా మేరకి ఆ ప్రకటన తనే వేయించాడు పరమేశం. అప్పటికే పాపతో అనుబంధం పెంచుకొంటున్న భార్య ఆ పిల్లమీదా ఇంకా మమత పెంచుకోకముందే, ఆ తల్లిదండ్రులెవరో వచ్చి, పాపని తమతో తీసుకువెళితే మంచిదన్న అభిప్రాయంతో ఆపని చేశాడు.

అది జరిగి కూడా నెలలు గడిచిపోతున్నా, అంత కాలం దాకా ఎవరూ రాకపోవడంతో ఇంకా పాపకోసం ఎవరూ రారనీ... పాప తమదే అన్న భావంతో వారుండగా, ఇప్పుడీ ఆగంతకుడు ఎవడో, ఎక్కడినుండో, ఉరవని పిడుగులా ఊడిపడి, ఈ ప్రకటన ఇచ్చింది మీరేనా... అని వాకబు చేస్తున్నాడు.

ఇతడు నిజంగాపాపకి బంధువో, శ్రేయోభిలాషో అయివుంటే, ఇంతకాలం దాకా పిల్లగురించి పట్టించుకోకుండా ఉండడం ఎలా జరుగుతుంది?

ఇందులో ఏదో మోసం ఉండి ఉంటుంది. ఏవో

మాయ మాటలు నాలుగు చెప్పి, అందమైన ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి, సాని కొంపలకి అమ్మే ముఠా ఒకటి చుట్టపక్కల ఊళ్ళల్లో తిరుగుతున్నట్టు పత్రికల్లో వార్తలు చూస్తున్నాడు.

ఎదుట ఉన్న వ్యక్తి ఆ కోవకి చెందినవాడు కాదని చెప్పడానికి ఆధారాలేం లేవు. అలాగని వచ్చిన వాడిని వచ్చినట్లే తరిమి కొట్టడానికి తగిన కారణాలు కన్పించడం లేదు. పైకి చూడ్డానికి మనిషి సామ్యుడుగా, మంచీ మర్యాదా తెలిసిన వాడిలా కనిపిస్తున్నాడు. ఇంటి లోపలికి పిలిచి, మాటల్లో పెట్టి, జాగ్రత్తగా నాలుగు ప్రశ్నలు వేస్తే అసలు రంగు బైటపడకపోదు... అనుకున్నాడు పరమేశం.

తన మనోభావాలు పైకి పొక్కకుండా జాగ్రత్త పడుతూ...''రండి...లోపలికి రండి... అలా బైట గుమ్మం లోనే ఉండిపోయా''రంటూ అతడిని సాదరంగా లోపలికి ఆహ్వానించాడు.

కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళిచ్చేడు. కూర్చోవడానికి కుర్చీ చూపి, వంట ఇంట్లోకి వెళ్ళి ఒక గ్లాసుతో చల్లని మజ్జిగ తెచ్చి ముందు పెట్టేడు. అతడు అది తాగి, కాస్త సేదతీరేక ''ఇప్పుడు చెప్పండి. మీరు వచ్చిన పనే మిటో?'' అంటూ మర్యాదగా ప్రశ్నించాడు.

ఒక్క నిముషంపాటు అతడు మాట్లాడలేదు. చేతిలో మడచి పట్టుకొన్న ఆ పేపరు కటింగ్‌వైపు చూస్తూ అలాగే ఉండిపోయాడు.

ఏం కథ చెప్పి, ఎలా ఇతన్ని బుట్టలో వెయ్యాలా అని ఆలోచిస్తున్నాడులా ఉంది ముసలాడు... అనుకొన్నాడు పరమేశం.

''ఈ ప్రకటన చాలా ఆలస్యంగా నా కంటపడింది. నాకు చేరిన ఈ కాపీలో ప్రింటు అంత బాగాలేదు. అందునా పత్రిక పాతబడి, నలిగి ఉన్న కారణాన ఫోటోలో ఉన్న పిల్లరూపు సరిగా పోలిక పట్టడానికి వీలుగా లేదు... ఈ ప్రకటన చూసేవరకు, తల్లిదండ్రులు, తాతా నాయనమ్మలతోపాటు, తను కూడా దురదృష్ట

## పేగుముడి

ఎందుకురా అమ్మను-
అనాధాశ్రయాల పాలుజేస్తారు!
తన రక్తాన్నే పాలుజేసి...
నోటికందించిన కామధేనువుకు చేటు చేస్తారు!
అమ్మంటే...
జీవితాంతం వెంటాడే అనుబంధాల పరిమళం!
ఎందుకురా పారిజాత పుష్పాన్ని
చెత్తకుప్పలో వేస్తారు!
ఆమె...
ఆప్యాయతానురాగాలలోగిలి
అనంతాక్షర సుమాల మధురానుభూతి!
తెలుగు అక్షరాలను మర్చినట్లు
అమ్మను ఎందుకురా నిర్లక్ష్యం చేస్తారు!
ఆమె నిరంతరం ఎదను పలుకరించే కమ్మని కావ్యం!
ఆ మమతానుబంధాలను నెమరువేయాలంటే
ఒక జీవితకాలం సరిపోదు!
తాను శిథిలమైనా తన బొడ్డు పేగుకోసం
రేయింబవళ్ళు శ్రమించే త్యాగమయి!
ఎందుకురా బొడ్డు పేగుబంధాన్ని నాశనం చేస్తారు!
జీవిత పుటలన్ని తిరగేసినా...
అమ్మలాలలన పాలన ఇంకా ఇంకా కావాలనే తపన!
తల్లిగా చెల్లిగా భార్యగా ప్రియురాలిగా
అన్ని పాత్రల్లోను అమ్మ స్పందనే!
అమ్మ గోరుముద్దలు లాలిపాటలు
మరల మరలి రావాలని...
అమ్మ ప్రేమను ఆస్వాదించాలనే ఆశ!
ఆమె కళ్ళల్లోకి చూస్తూ...
ఆ మాతృమూర్తి బడిలో శ్వాస విడవాలని
జన్మంటూ ఉంటే అమ్మగా జన్మించాలని
ఎన్ని ఆశలో...!
అంత గొప్ప ఆశయాన్ని...
ఎందుకురా కాలరాస్తారు...?

గుర్రాల రమణయ్య

దారుణ అగ్ని ప్రమాదంలో కాలి బూడిద అయి పోయిందే అనుకొన్నాను. మీరు అంటున్న ఈ పాప నా మనుమరాలు అవునో కాదో నాకు తెలియదు. అవునేమో అన్న ఆశతో ఇంత దూరం వచ్చాను...'' ఒక్కొక్క మాటే ఆపి ఆపి అతి నెమ్మదిగా అంటున్నాడు అతడు.

చివరి మాట అతని నోట తిన్నగా పెగిలిరాలేదు. దుఃఖభారంతో అతడి గొంతు పూడిపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అది కేవలం నటనో... నిజమైన దుఃఖమో పోల్చుకోలేక పోయాడు పరమేశం.

ముసలాయన కళ్ళు తుడుచుకొని మళ్ళా చెప్పడం మొదలుపెట్టాడు. ''మల్లారం మరిడిమాంబ తిరునాళ్ళలో జరిగిన దుర్ఘటన గురించి మీరు వినే ఉంటారు...''

మల్లారం వారి పొరుగు గ్రామమే. ఆ దుర్ఘటన గురించి వినడమే కాదు.. ఆ జాతరలో జరిగిన బీభత్సాన్ని కళ్ళారా చూశాడు పరమేశం. తలవెంట్రుక వాసిలో చావు తప్పి బైటపడింది అతని కుటుంబం. ఆనాటి సంఘటన తలుచుకొంటే, ఇంతకాలం గడచినా ఇప్పటికీ అతడికి ఒళ్లు గగుర్పొడుస్తుంది.

❖ ❖ ❖

ఆరోజు మల్లారం గ్రామదేవత మరిడిమాంబ తిరునాళ్ళ పండుగ. ఎంతెంత దూరం నుండో ప్రజలు తండోపతండాలుగా వచ్చి చేరారు. ఆ తల్లికి మొక్కిన ఏ మొక్కూ తీరకుండా పోదనీ... అంత మహత్యంగల దేవత మరిడిమాంబ అని ప్రతీతి. ఎక్కడెక్కడి నుండో వస్తారు భక్తులు మొక్కలు తీర్చుకోవడానికి.

మరిడిమాంబ గుడి వున్న వీధి అంత విశాలమైంది కాదు. అందునా దారికి ఇటు అటు పాకలు వేసి దుకాణాలు పెట్టేరు. వరుసగా పదిమంది జట్టుకట్టి నడవడానికి అవకాశంలేని ఆ ప్రదేశంలో, వందలు... వేలు మనుషులు. ఇసుకవేస్తే రాలనంతగా ఉన్నారు జనం. ఉత్సవం బ్రహ్మాండంగా జరుగుతోంది. పులివేషాలు... బిళ్ళ వేషాలు, సాముగరిడీలు, చెక్క భజనలు, పగటి వేషాలు... బుట్ట బొమ్మలు... ఒకటేమిటి, అటువంటి పండుగ సమయాల్లో ఉండవలసిన అన్ని హంగులతో జాతర సాగిపోతోంది.

అంతలో జరిగింది ఆ దారుణ సంఘటన. గ్రామంలోని రెండు ప్రత్యర్థి ముఠాలమధ్య చెలరేగిన విద్వేష పూరితమైన బాణాసంచా పోటీ. ఎవరు ఎటువైపు విసురుతున్నారో గుర్తించుకోకుండా, మందుగుండు సామాగ్రి కాల్చడం మొదలుపెట్టారు. కాల్చిన ఔట్లు, తారాజువ్వలు దారికి ఇటు అటు ఉన్న పాకలపైనా, యాత్రికుల విశ్రాంతి కోసం వేసిన పందిళ్ళ పైనా పడి, ఒక్కసారిగా నాలుగు వైపుల నుండి మంటలు లేచాయి. అదే సమయంలో ఒకచోట, కుప్పగా పోసిన బాణాసంచా పోగులు అంటుకున్నాయి.

ఆ ఇరుకు సందులో, ఆకాశాన్ని తాకుతున్న మంటల్లో అసంఖ్యాక జనసందోహపు ఒత్తిడిలో, ఎంత మంది చిన్నా... పెద్దా, ముసలీ, ముతకా మృత్యుదేవతకి ఉపాహారం అయ్యారో ఎవరూచెప్పగలిగే పరిస్థితిలేదు. ఎక్కడెక్కడినుండో జాతర చూడాలని ఉత్సాహంతో వచ్చిన వారు ఆ తల్లి గుడి ముందు బూడిద పోగులుగా మిగిలిపోయారు.

అంతకు కొద్దిసేపటికి ముందు ఆనం దోత్సాహాలతో పరవళ్ళు తొక్కుతున్న ఆ ప్రదేశమంతా అంతలోనే పెద్ద స్మశానంగా మిగిలిపోయింది. జరిగిన ధన ప్రాణ నష్టాలు ఎవరి అంచనాలకీ అందకుండా పోయాయి.

వెనుకనుండి వెంట తరుముతున్న మంటలతో, జన సందోహపు ఆర్తనాదాలతో బీభత్సంగా మారిన ఆ ప్రదేశం నుండి, ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని, అందుకొన్న పరుగు ఆపకుండా పరుగెత్తిక్షేమంగా ఇల్లు చేరుకున్నారు పరమేశం కుటుంబం.

వణుకుతున్న చేతులతో, ఇంటి తలుపు తాళంతీసి, వారు లోపలికి రాబోతుంటే, ఎవరో చిన్నపిల్ల వెక్కివెక్కి ఏడుస్తూ, వీధి అరుగు నీడలో కనిపిం చింది. ఆ పాప బట్టలు చిరిగి ఉన్నాయి. వంటిమీద అక్క డక్కడ గీరుకున్న దెబ్బలున్నాయి.

''ఎవరు పాపా నువ్వు... మీవాళ్ళు ఎక్కడున్నారు?'' అని ప్రశ్నిస్తే అంతవరకు మెల్ల మెల్లగా ఏడుస్తున్నదల్లా ఒక్కసారిగా గొల్లున ఏడవడం మొదలుపెట్టింది. ఎవరో పిల్ల జాతరలో తప్పిపోయి ఇటు వచ్చి ఉంటుంది, లేక ఏ దొంగ వెధవో ఒంటిమీద నగా నట్రా ఒలుచుకుని, పిల్లని ఇక్కడ విడిచి ఉంటాడు. ఎలా జరిగినా తెల్లారేసరికి వాళ్ళ వాళ్ళు రానే వస్తారు.

ఈ రాత్రికి ఇంటిలోకి తీసుకుపోయి, కాస్త బుజ్జగించి ఇంత తిండిపెట్టి నిద్రబుచ్చితే సరి అనుకున్నారు. దెబ్బలు తుడిచి, మందు రాసి... బురద కొట్టుకున్న బట్టలు విడిపించి వేరు బట్టలు తొడిగింది కాంతమ్మ. ఎవరు ఎంతగా బ్రతిమాలినా పాప, ఆ రాత్రికి తినడం... తాగడం ఏమీ చెయ్యలేదు. అలా వెక్కి వెక్కి ఏడుస్తూనే ఎప్పుడో నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారి జాము పొద్దెక్కినా పాపకోసం ఎవరూ

రాలేదు. పాప తన ఊరూ పేరూ గాని, తనవారి గురించి గాని ఎటువంటి సమాచారం ఇవ్వడానికి సిద్ధంగా లేదు. ఎవరు తన గురించి ప్రశ్నలేసినా బావురని ఏడవడం మొదలుపెట్టేది. ఆ ఏడ్పులోనే కొయ్యబారిపోయి, ఫిట్సు వచ్చినదానిలా కాళ్ళూ చేతులూ బిగపెట్టేది. ఎంతో ఓర్పుతో కాంతమ్మ పదే పదే బ్రతిమిలాడి, బుజ్జగించి ఆ పూటకి కాస్తంత పెరుగు అన్నం మాత్రం తినిపించ గలిగింది.

ఊరు ఊరంతా రాత్రి జరిగిన ఘోరకలితో ఉడికి పోతోంది. చావగా మిగిలినవారు, తప్పిపోయిన తమ పిల్లలకోసం, సమీప బంధువులకోసం, వీధులూ, తోటలూ, సమీప పొలాలు, నూతులూ, గోతులూ వెతుకులాడ్డం మొదలుపెట్టారు. గ్రామస్తుల ఇళ్ళల్లో ఆ రాత్రికి తలదాచుకొన్న పై ఊళ్ళ జనం అందిన వాహనాన్ని పట్టుకుని తమ తమ ఊళ్ళకి పోసాగారు.

ఫైరు ఇంజన్లు, అంబులెన్సులు, పోలీసు జీపులు, నేరస్థులకోసం గాలింపులూ, అరెస్టులూ, ఊరు ఊరంతా ఒకటే గడబిడగా ఉంది. తమ ఇంటి ముందుకి ఎవరు వచ్చినా ఏపాటి సడి అయినా పాపకోసమే ఎవరో వచ్చారనుకొని తలుపు తియ్యసాగారు పరమేశం దంప తులు. ఆరోజు, మరురోజు, వరుసగా నాలుగురోజులు గడిచినా పాపకోసం ఎవరూ రాలేదు.

ఊరు చల్లబడింది. ఊరిలో కొత్తముఖాలు పలుచన బడ్డాయి. మరిడిమాంబ గుడి ముందు బూడిద పోగుల్ని చెత్తలబళ్ళవాల్ళు ఎత్తుకుపోయారు. ఊరిలో సగం మంది యువకులు పోలీసు కటకటాలవెనక్కి వెళ్ళారు. వారంనాడుఎటువంటి ఆర్భాటం లేకుండా మరిడిమాంబ అనుపు పండుగ జరిగిపోయింది.

పాప తమ ఇంట కాలుపెట్టి పదిరోజులు గడుస్తున్నా తన బంధువులు ఎవరూ వెతుక్కుంటూ రాలేదు. పర మేశం పోలీసు స్టేషనుకి వెళ్ళి తప్పిపోయిన పిల్లల వివ రాలు తెలుసుకొన్నాడు. ఫోటోలు చూశాడు. వాటిలో తమ ఇంట ఉన్న పాప ఫోటో లేదు. పొరుగూరిలో ఉన్న పెద్ద లైబ్రరీకి వెళ్ళి రెండు, మూడు వారాల దొరికిన దిన పత్రికలన్నీ తిరగేసి చూశాడు. వాటిలో తప్పిపోయిన పాపకోసం ఎటువంటి విజ్ఞప్తి లేదు.

ఈలోగా ఇంట్లో పాప కాంతానికి మాలిమి అయింది. పిల్లలతో కలిసి ఆటపాటలు మొదలుపెట్టింది. రోజులు వారాలకి మారుతున్నా పాప సమస్యకి ఒక పరిష్కార మార్గం కనిపించలేదు పరమేశానికి. అతుడు పదే పదే పోలీసు స్టేషనుకుపోయి వాకబు చేస్తుండడంతో అక్కడి వారు విసిగి, ''మాకు తమ పిల్ల తప్పిపోయినట్లు బంధు వుల నుండి ఫిర్యాదు రాందే మేమేం చెయ్యలేమండీ. ఉంచుకోవాలనుకుంటే మీ ఇంట ఉంచుకోండి. లేదంటే ఏ అనాథ శరణాలయానికో, చైల్డ్ వెల్‌ఫేర్ సెంటరుకో పంపేయండి'' అంటూ తెగేసి చెప్పారు.

పాపని ఎక్కడికైనా పంపివేయడానికి కాంతమ్మ ఎంత మాత్రం ఒప్పుకోలేదు. ''ఎవరూ రాకపోతే పోనీండి. మన ఇంట్లో మన పిల్లలతోపాటే తనూ పెరుగుతుంది. ఆడ పిల్లలేని నాకు ఆ కొరత తీరడానికి మరిడిమాంబ తల్లే ఈ పిల్లని మన దగ్గరికి ఇలా పంపింది అనుకొందాము'' అంది ఆమె.

కాంతమ్మ అయితే అలా సంతోషపడి, పాపని తన బిడ్డలతో కలిపేసుకోగలిగింది. కాని పరమేశం అలా అనుకోలేదు. పాప బంధువులెవరో తెలుసుకోవాలి. వారికి వారి పిల్లని అప్పచెప్పాలి. ఒక మనిషిగా అది తన కనీస బాధ్యత అనుకొన్నాడు. మిత్రుల సలహాలపై చివరి ప్రయత్నంగా బాగా ప్రచారంలో ఉన్న ఒక ప్రముఖ దిన పత్రికలో పాప ఫోటో, వివరాలతో ఆ ప్రకటన వేయిం చాడు.

అది జరిగి కూడా అయిదారు నెలలు గడిచి పోయింది. పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించక పోవడంతో, ఇంక పాప తమదే అన్నభావం, నమ్మకం పరమేశం, కాంతమ్మలకే కాక, పాప ఉదంతం తెలిసిన చుట్టుపక్కల వారికి కూడా కలిగింది.

ఆ ఉత్సాహంతో ఆరోజు పాప పుట్టినరోజు పండుగ ఇంట్లో సంతోషంగా జరుపుకొంటుంటే, ఆ సమయంలో ఎవడో, ఎక్కడివాడో తెలియని వ్యక్తివచ్చి ఏదో కథ చెప్తు న్నాడు. అతడు నిజంగా పాప బంధువే అయితే అతడితో పాపని పంపించడానికి పరమేశానికి ఎటువంటి అభ్యం తరం ఉండదు. అలాకాక అతడు మోసగాడై పేపరు ప్రకటన చూసి, దాని ఆధారంగా ఏదో కథలల్లి చెప్పి, పిల్లని తీసుకుపోవాలనుకుంటే, అటువంటి పాచికలేం తన దగ్గర పారవని అతడికి నిస్సంకోచంగా తెలియ జెప్పాలి అనుకున్నాడు పరమేశం. అతడు తన ఆలోచ నల్లో తాను సతమతమౌతుంటే... ముసలాయన ఎటో చూస్తూ తన కథ చెప్తున్నాడు.

తన ఒక్కగానొక్క కూతురి గురించి చెప్తున్నాడు... అల్లుడిగా చేసుకొన్న మేనల్లుడి గురించి చెప్తున్నాడు. కొడుకూ, కోడలూతోపాటు మాడి మసైన తన తోడ బుట్టినదాని గురించి చెప్తున్నాడు. బావమరిది గురించి, ఈ ఘోర వార్త వినగానే ప్రాణం వదలిన, గుండెజబ్బు

## రైతన్నల నానీలు

రైతును కూలీగా
మార్చిన
సెజ్
భూతం

బి.టి. విత్తనం
బహుళజాతి
కంపెనీల
విషపు పుత్రిక

మోట
బావిని
మింగేసిన
బోరు బావి

అటకెక్కిన
అరకలు
పరుగులు తీస్తున్న
ట్రాక్టర్లు

కోడికూతలు
లేవు
అన్నీ
సెల్‌ఫోన్ల మోతలే!

పొలాల్లో
హార్వెస్టర్లు
దిక్కులు చూస్తున్న
కూలీలు

కెంటు
వెలుగులో
కునుకుతీస్తున్న
కుంపటి

బోరు
బిక్కింది
రైతు గొంతు
తడారింది

పొలంగెట్టు
అన్నదమ్ముల
మధ్య
విభజన రేఖ

కరువు కాలం
రైతు చెమటతో
మొలకెత్తిన
విత్తనం

చెరువులు
అలుగుపోశాయి
కొంగలు
జపం చేశాయి

**మేరెడ్డి యాదగిరి రెడ్డి**

మనిషి భార్య గురించి చెప్తున్నాడు. తనది అనుకొన్న సంసారం అంతా ఒక్కసారిగా అలా కుప్పకూలిపోయి, జీవితం స్మశాన సదృశంగా మారిపోవడంతో, ఆ వైరాగ్యంతో తను దేశాలు పట్టుకు తిరిగిన తిరుగుళ్ళ గురించి చెప్తున్నాడు.

అతడు తన మనుమరాలి వివరాలు చెప్తుంటే పరమేశం గుండెల్లో రైళ్ళు పరుగులు తీసేయి. అతడి కళ్ళ ముందున్న ఆశల సౌధం విరిగిపడి ఛిన్నాభిన్నం అయింది. అతడు చెప్తున్న మనుమరాలి వర్ణన, పాప పోలికలతో చాలా వరకు కలిసి వస్తోంది. పేపరులో పడ్డ ఆ చిన్న ఫోటో చూసి, అంత వివరంగా పిల్ల అందచందాలు, హావభావాలు వర్ణించి చెప్పడం ఎంత కల్పనాశక్తి ఉన్నవారికైనా సాధ్యపడే విషయం కాదు.

ముసలాయన తన కథనం ముగించి, పై బట్టతో మరొకసారి కళ్ళు తుడుచుకొన్నాడు. ఈసారి పరమేశానికి అది నటనలా అనిపించలేదు. అవి దొంగ కన్నీళ్ళలా కనిపించలేదు. అతడిపట్ల మొదట్లో ఏర్పడిన సంశయ భావాలు క్రమంగా తొలగిపోయి, వాటి స్థానంలో సాను

భూతి చోటుచేసుకుంది.

భర్త, ముందు వాకిలి వరండాలో చాలాసేపు ఎవరి తోనో మాట్లాడుతూ ఉండిపోవడం కాంతమ్మ గమనించింది. వచ్చింది ఎవరా అని అటు చూడవచ్చింది. భర్త ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి. అక్కడే నిలబడి పరిశీలనగా అతడి వంక చూసింది. పరమేశం భార్యని అతడికి పరిచయం చేశాడు.

''ఈయన రంగస్వామి గారని... చాలా దూరం నుండి మనల్ని చూడ్డానికి వచ్చారు'' అన్నాడు. ఆ పరిస్థితిలో భార్య ముఖం చూస్తూ, అతడు పాపకోసం వచ్చాడని చెప్పలేకపోయాడు పరమేశం.

''అయ్యో! అంత దూరం నుండి, మనపై అభిమానంతో ఆయన చూడవస్తే ఇంతసేపూ ఊరికే కూర్చోబెట్టి మాట్లాడుతున్నారా? నన్ను పిలిస్తే కాస్త కాఫీ, టిఫిను తెచ్చి పెట్టేదాన్నికదా'' అంటూ కాంతమ్మ లోపలికి వెళ్లి, ఒక ప్లేట్లో రెండు పెరుగ్గారెలు, చిన్న గిన్నెలో పాయసం, ఒక గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి అతడి ముందు పెట్టి ''తీసుకోండి'' అంది.

''ఇప్పుడు ఈ శ్రమంతా దేనికమ్మా'' అన్నాడు అతడు మొహమాటపడుతూ.

''శ్రమకే ముందండీ! ఈరోజు మా పాప పుట్టినరోజు. అనుకోకుండా వచ్చిన అతిథి దైవసమానుడు అంటారు పెద్దలు. మీరు తింటూ ఉండండి. కాఫీ తెస్తాను. మీచేత్తో పాప తలపైన నాలుగు అక్షింతలు వేసి మరీ వెళ్ళండి'' అని కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళింది కాంతమ్మ.

''ఈరోజు మా పాప పుట్టినరోజు'' అని భార్య అన్నప్పుడు ముసలాయన ఆమె అంటున్నదేమిటో అర్థం కానట్లు, అయోమయంగా ఆమెవైపు చూడ్డం పరమేశం గుర్తించాడు.

''పాప ఎప్పుడు పుట్టిందో మాకు తెలియదు. మా ఇంటికి వచ్చి ఈనాటికి ఏడాది అయింది. అందుకే మా ఆవిడ ఈరోజు పాప పుట్టినరోజు పండుగ జరిపిస్తోంది'' అన్నాడు.

ఎండ చల్లబడింది. పాపకి తలదువ్వి, పట్టుపావడా కట్టి, మెడలో తన మూడు వరసల ముత్యాల హారం వేసి, బొట్టూ, కాటుకా... బుగ్గన దిష్టితగులకుండా చుక్క పెట్టి అలంకరించింది కాంతమ్మ. ఇరుగు పొరుగు ఇల్లాళ్ళు పేరంటానికి వచ్చారు. వాళ్ళు కూర్చోవడానికి మధ్య హాలులో చాపలు పరిచారు. కుర్చీలో పాపని కూర్చోబెట్టి, దిష్టితీసి, హారతి పట్టారు. పేరంటాళ్ళ కలగలుపు గొంతులలో పాపని నిండా నూరేళ్ళు సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో సుఖంగా జీవించమని దీవిస్తూ పాడుతున్న పాటలు, ముందు వరండాలోకి వినిపిస్తున్నాయి.

ముసలాయన కళ్ళుమూసుకుని తృప్తిగా ఆ పాటలు వింటున్నాడు. అతడి ముకంలో ముందున్న విషాదం ఇప్పుడు కనిపించడంలేదు. టిఫిను తిని, కాఫీ తాగేక మనిషి కాస్త కోలుకున్నాడు... అనుకున్నాడు పరమేశం.

''రండి... మా ఆవిడ పిలుస్తోంది. మనం కూడా వెళ్ళి అక్షతలు వేసివద్దాం'' అంటూ అతన్ని లేవదీసేడు.

మగవాళ్ళు హాలులోకి రావడం చూసి, ఆడంగులు పక్కకి తప్పుకొని, వారికి దారి ఇచ్చారు. కాంతమ్మ ముందుకొచ్చి, వారి చేతిలో అక్షతలు ఉంచింది. ఎదురుగా కుర్చీలో పాప, చుట్టూ ఉన్న పిల్లల మధ్య చుక్కల్లో చంద్రుడిలా మెరిసిపోతోంది. అసలే అందమైన పిల్ల - కాంతమ్మ చేసిన అలంకరణతో చూడ్డానికి రెండు కళ్ళూ చాలవన్నట్లు ఉంది.

కన్నార్పకుండా పాపవంకే చూస్తున్నాడు అతడు. అతడి కళ్ళవంకే చూస్తున్నాడు పరమేశం. క్షణకాలం అతడి చూపుల్లో హరివిల్లు రంగులు మెరిసేయి. అతడి ముఖంలో సంతోషతరంగాలు పరవళ్ళు తొక్కేయి.

''అయిపోయింది. భయపడినంతా అయిపోయింది. అతను తన మనుమరాల్ని పోల్చుకున్నాడు. ఇంక తనతో తీసుకుపోతాడు'' అనుకొన్నాడు పరమేశం బాధగా. అంతలోనే ముసలాయన ముఖంలో రంగులు మారేయి. క్షణకాలం కింద హరివిల్లు రంగులు మెరిసిన కళ్ళల్లో నిరాశా మేఘాలు కమ్ముకొచ్చాయి. ఆ మార్పుకి కారణం ఏమిటో పరమేశానికి అంతుబట్టలేదు.

అతడు పాపని పోల్చుకొంటాడా... లేదా అన్నది అసలు ప్రశ్నే కాదు. పాప అతన్ని పోల్చుకొంటుందా... లేదా? అన్నదే పరమేశం పెట్టుకున్న గీటురాయి. దాని కోసమే ఆత్రంగా అతడు పాపవైపు చూస్తున్నాడు.

పరమేశంతోపాటు ఇంకొక వ్యక్తి హాలులో కాలు పెట్టినప్పుడే పాప ముఖకవళికల్లో ఏదో మార్పు వచ్చింది. కూర్చున్నా ఇబ్బందిగా కదలసాగింది. వాళ్ళు తనకు దగ్గరగా రాబోతూంటే ముసలాయన వంక పరీక్షగా పట్టి, పట్టి చూసింది. కొద్దిసేపు ఆ కళ్ళల్లో ఏదో చెప్పలేని భావం... ఏవో జ్ఞాపకాల అలజడి... అది గుర్తింపే అనుకొన్నాడు పరమేశం. అతడి మనసు గాలి తీసిన బెలూన్‌లా అయిపోయింది. ఇక ఏ క్షణంలోనైనా పాప కుర్చీలోంచి లేచి వచ్చి, ''తాతా!'' అంటూ ముసలాయన చేతుల్లో వాలిపోతుంది అనుకున్నాడు.

సంతోషమే మూర్తీభవించినట్టు పేరంటాళ్ళ మధ్య తిరుగుతున్న భార్యని చూస్తే అతడికి జాలివేసింది. పాపం! పిచ్చిది, పాపపై ఎంత మమత పెంచుకుంది. ఎన్ని ఆశలు పెట్టుకుంది. మరికొద్దిసేపట్లో ఈ పాప తనకి శాశ్వతంగా దూరంగా కాబోతోంది అని తెలిస్తే, ఈ ఆనందం అంతా ఏమైపోతుంది? ఆ నిరాశలో ఎలా బ్రతుకుతుంది? అనుకున్నాడు.

పాప కళ్ళల్లో కదలాడిన ఆ భావం ఒక క్షణకాలం మాత్రమే అక్కడ నిలిచింది. మరుక్షణంలో అతడి నుండి పూర్తిగా చూపు తిప్పేసుకొంది. కొత్తవాళ్ళని చూస్తే, చిన్న పిల్లలు బిడియంతో తల్లి కొంగుచాటున ముఖం దాచుకొని దాగొనేటట్లు కాంతమ్మ పైట కొంగులో దూరిపోయింది.

''ఎందుకే అంత సిగ్గు? కొత్తవారు ఎవరున్నా రనీ!'' అంటూ పాప బుగ్గ పుణికి ముద్దుపెట్టుకొంది కాంతమ్మ.

ముసలాయన భారంగా నిట్టూర్చేడు. అందులోని విషాదాన్ని పరమేశం ఒక్కడే గుర్తించగలిగేడు. అతడివంక జాలిగా చూసేడు. పాపని దీవించి, తలపై అక్షతలు వేసి ఇద్దరూ తిరిగి ముందు చావిట్లోకి వచ్చేరు. 'భగవంతుడు దయామయుడు' అన్నాడు అతడు. ఆ మాట తనలో తనే అనుకొన్నంత నెమ్మదిగా. అతనికి ఎదురుగా కుర్చీలో వచ్చి కూర్చున్నాడు పరమేశం.

''పాపని చూసేరు కదా? ఏమంటారు?'' అన్నాడు మాటలు మొదలుపెడుతూ.

''పోలికలు చాలా ఉన్నాయి. పాపని చూడగానే నా మనసు సంతోషంతో పొంగిపోయింది. నా ఒంటరి బ్రతుక్కి ఒక తోడు దొరికినట్లు అనిపించింది. క్షణకాలం పాటు, నా మనుమరాలే అనుకొన్నాను. 'తాతా' అంటూ వచ్చి, నా కాళ్ళని వాటేసుకొంటుంది అనుకొన్నాను. కానీ...''

''కాదంటారా?'' సంశయంగా ప్రశ్నించేడు పరమేశం.

'కాదు' అన్నట్లు తల అడ్డంగా ఊపాడు అతడు.

''మరి చాలా పోలికలు ఉన్నాయంటున్నారు?''

పరమేశం ప్రశ్నని అతడు వినిపించుకోలేదు. కాంతమ్మ ఇచ్చిన వాయినాలు పుచ్చుకొని పేరంటాళ్ళు ఇళ్ళకి పోతూ ముందు వాకిలిలోకి వచ్చారు. వాళ్ళ వెను కగా పిల్లలు. అది వాళ్ళ ఆట సమయం, ఎదురుగా ఉన్న స్కూలు ఆట స్థలంలో ఆడుకోవడానికి వెళ్తున్నారు. వాళ్ళలో పాప కూడా ఉంది.

''జాగ్రత్తగా చూసుకు నడువు. పావడా కుచ్చెళ్ళు కాలిలో పడితే పడిపోతావు. రోడ్డు దాటుతున్నప్పుడు అన్నయ్య చెయ్యి గట్టిగా పట్టుకో'' కాంతమ్మ పాపకి జాగ్రత్తలు చెప్తున్నాది.

పాపమీద కళ్ళు తిప్పుకోకుండా, ఆ పిల్ల ప్రతి కదలికనూ ముచ్చటగా చూస్తున్నాడు ముసలాయన. ఆ పిల్ల తన మనుమరాలు కాకుండా పోయింది అన్న విచారం అప్పుడు అతడి ముఖంలో కనిపించడంలేదు. అతడి కళ్ళలో నీటిపొర లేదు. వాటిలో ఆనంద తరంగాలు డోలలాడుతున్నాయి.

''మీకింకా సంశయమేమైనా ఉంటే ఒక పని చెయ్యండి'' అన్నాడు పరమేశం. ఇదే మీకు నేను ఇస్తున్న చివరి అవకాశం అన్నట్లు.

''చెప్పండి'' అన్నాడు అతడు పాప మీంచి దృష్టి మళ్ళించకుండానే.

''మీరు మీ మనుమరాల్ని ఇంట్లో ముద్దుగా పిలచుకునే పేరేదో ఉంటుంది కదా... ఆ పేరు పెట్టి పిలవండి. పాప వెనుదిరిగి చూస్తుందేమో... అది తన పేరుగా

## తేనె స్నానం!

నా భాషక
అందాల నుడికారం!
మాతృత్వపు మమకారం
దాన్ని రేపటితరానికి అందిద్దాం
భాషను బ్రతికించుకుందాం....
మళ్ళీ నా నాలుక మీద
ఆటవెలదులు ఆటలాడాలి!
తేటగీతులు వికసించాలి
వ్యాకరణానికి వ్యాకులతలు పోవాలి
గ్రామ్యానికి గౌరవం కల్పించాలి
భాషాసౌందర్యం అద్దుకుందాం
నిముషంలో మర్చిపోయే 'థేంక్సు' నుంచి
ధన్యవాదాల్లోకి దిగుదాం!
భావనా సముద్రంలో
తేనెస్నానాలు చేద్దాం!
ప్రపంచానికే తలమానికాలౌదాం!!

గుడిమెట్ల గోపాలకృష్ణ

గుర్తిస్తుందేమో చూద్దాం'' అన్నాడు పరమేశం.

కొద్దిసేపు సాలోచనగా కళ్ళు మూసుకున్నాడు అతడు. అంతలో ఏదో నిర్ణయించుకొన్నట్లు కూర్చుని... 'నిర్మల తన పేరు, 'నిమ్మీ' అని పిలిచేవారిమి అంతా'' అన్నాడు.

''అలాగే పిలవండి'' అంటూ తొందర చేశాడు పరమేశం.

అప్పటికే పిల్లలు వీధి గుమ్మం దాటి వెళ్ళిపోతున్నారు.

''నిమ్మీ... నిమ్మీ! ఒకసారి ఇలారా తల్లీ!'' అంటూ ఆప్యాయంగా పిలిచాడు అతడు. గుంపుగా వెళ్తున్న పిల్లల్లో ఒకరిద్దరు వెనుదిరిగి, అతడు అలా పిలుస్తున్నది ఎవర్నా అన్నట్లు చూశారు. వాళ్ళలో పాప లేదు.

''నేనింక వెళ్ళొస్తాను'' అంటూ లేచాడు. అతడు తను వచ్చిన పని అయిపోయింది అన్నట్లు.

''ఈ రాత్రికి ఉండి రేపు వెళ్ళరాదూ? బాగా అలిసిపోయినట్లు ఉన్నారు'' అంది కాంతమ్మ.

''ఇప్పుడు కాదు. ఇంకొకసారి వస్తాను'' అని క్షణకాలం ఆగి, ''మీ ఆతిధ్యానికి ధన్యవాదాలు. మీవంటి దంపతుల చేతుల్లో పడ్డ పాప అదృష్టవంతురాలు. ఆ భగవంతుడు పాపని, మిమ్మల్ని ఆయురారోగ్యాలతో పదికాలాలపాటు చల్లగా చూడాలి'' అంటూ దీవించాడు.

''పదండి మిమ్మల్ని బస్సెక్కించి వస్తాను. బజార్లో నాకూ కొంచెం పని వుంది'' అంటూ తనూ అతనితో పాటు నడిచాడు పరమేశం.

వాళ్ళు బస్టాండుకి చేరేసరికి అతడు వెళ్ళవలసిన బస్సు కదలడానికి సిద్ధంగా ఉంది. అతడు అందులో ఎక్కి కిటికీ పక్కగా ఉన్న సీటులో కూర్చున్నాడు. పరమేశం కింద నిలబడి అతడివంక చూస్తున్నాడు.

అతడు తమ ఇంట కాలుపెట్టినప్పటి నుండి జరిగిన సంఘటనలన్నీ ఒకటొకటి అతడి మనసులో కదులుతున్నాయి. కొన్ని గంటకి పూర్వం అతడెవరో? తనెవరో, ఈ కొద్ది సమయంలో అతడు తనకెంతో ఆప్తుడయినట్లు అనిపిస్తోంది. పాప అతడి మనుమరాలు కాకపోయినందుకూ, ఎంతో ఆశతో వచ్చిన అతడు అలా రిక్తహస్తాలతో తిరిగి వెళ్తున్నందుకూ మనసులో ఎంతో బాధపడ్డాడు.

''మీరు ఎప్పుడైనా ఇటువైపు వస్తే తప్పక మా ఇంటికి రండి'' అన్నాడు వీడ్కోలుగా.

డ్రైవరు స్టీరింగు ముందు కూర్చున్నాడు. బస్సు కదలబోతోంది.

## 'బా ల్యం' బాగుంది

పసితనం అమ్మ ఒడిలో 'అల్లారుముద్దు'గా
గడిచింది - ఆడింది పాడింది
బాల్యం బడికెళ్ళింది 'బుద్ధిగా' చదువుకుంది
కుర్రతనం కాలేజీలు - యూనివర్సిటీలకెళ్ళింది
'గాలిగా' సినిమాలు పార్కుల వెంట తిరిగింది
తుళ్ళిన యవ్వనం 'గుడ్డిగా' ప్రేమించింది
పెద్దలను ఎదిరించి మరీ పెళ్ళి చేసుకుంది, తప్పనిసరై
ఆఫీసుకెళ్ళింది
నడి వయసు 'మామూలు'గానే గంపెడు సంసారం
పెంచింది
మోయలేని భారం నెత్తిన పెట్టింది
మళ్ళిన వయసు 'భక్తి'గా తీర్థయాత్రకెళ్ళింది
తిరిగొచ్చాక దిక్కులేక ఆశ్రమాలకెళ్ళింది
పండిన ముసలితనం 'విరక్తి'గా కాటికెళ్ళింది
జీవితం మొత్తంలో 'బాల్యం' బాగుంది

**బి.ఎం.పి.సింగ్**

''చిన్నమాట'' అన్నాడు అతడు కిటికీలోంచి కొంచెం ముందుకు వంగి.

ఏమిటన్నట్లు చూశాడు పరమేశం.

''ఇందాక మీ ఇంట్లో ... పాపని 'నిమ్మి' అని నేను పిలిస్తే పలకలేదు కదూ. 'కిట్టూ' అని పిలవండి. పలుకుతుంది. వాళ్ళమ్మ దాన్ని అలాగే పిల్చేది. దాని పూర్తిపేరు కృష్ణప్రియ'' అన్నాడు అతడు నెమ్మదిగా.

''బాబుగారూ'' అన్నాడు పరమేశం రెండు చేతులూ పైకెత్తి అతడికి దండం పెడుతూ బస్సు రొద చేస్తూ కదిలింది.

''కిట్టూ పుట్టినరోజు ఈసారి మండు వేసవిలో కాదు. చల్లని చలికాలంలో సంక్రాంతి రోజున చెయ్యండి'' ప్రతిగా చెయ్యి ఊపుతూ గట్టిగా అన్నాడు అతడు.

ధూళి చిమ్ముకొంటూ బస్సు ముందుకి పోయింది.

ఆశ్చర్యం నుండి కోలుకొన్న పరమేశం ఇంటి ముఖం పట్టాడు. ■